


EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
14-01-2026
పేజీలు: 02




# అనగనగా ఒక రాజు రివ్యూ

నవీన్ పోలిశెట్టి కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'అనగనగా ఒక రాజు'. మారి దర్శకుడు. ఇందులో మీనాక్షి చౌదరి హీరోయిన్. ఈ రోజు థియేటర్లలో విడుదలైన ఈ సినిమా ఎలా ఉందో రివ్యూ చూద్దాం రండి. రాజు (నవీన్ పొలిశెట్టి) జమీందారీ కుటుంబంలో పుట్టినా.. బయటకు తెలియని పేదరికంలో బతుకుతూ ఉంటాడు. తన తాత చేసిన దుబారా ఖర్చులు కారణంగా రాజుకి ఆస్తులు ఏమి మిగలవు. ఇలాంటి రాజుకి అనుకోకుండా చారులత (మీనాక్షి చౌదరి) కనిపిస్తుంది. ఆమెను పెళ్లి చేసుకుంటే.. లైఫ్ సెట్ అవుతుందని.. ఆమెకు కోట్ల రూపాయల ఆస్తులు ఉన్నాయని.. చాలా ప్లాన్డ్ గా ఆమెను టార్గెట్ చేసి.. ప్రేమలో పడేసి పెళ్లి చేసుకుంటాడు రాజు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో చారులత గురించి, ఆమె తండ్రి పెట్టిన బాధ్యత గురించి రాజుకి అసలు నిజం తెలుస్తోంది. ఇంతకీ ఏమిటి ఆ నిజం ?, అది తెలిశాక రాజు జీవితం తారుమారు అవుతుంది. మొత్తానికి తనకొచ్చిన ఆ సమస్యలు నుంచి రాజు ఎలా బయట పడ్డాడు ?, ఆ క్రమంలో రాజు ఏం సాధించాడు ?, చివరకు రాజు ఏం చేశాడు ? అనేది మిగిలిన కథ. తన కామెడీ టైమింగ్ తో తెలుగు ప్రేక్షకులకు దగ్గర అయిన నవీన్ పొలిశెట్టి, ఈ సినిమాతో కూడా ఆకట్టుకున్నాడు. తన శైలి కామెడీ టైమింగ్ తో పాటు స్టైలిష్ ఎలిమెంట్స్ తో మరియు కొన్ని చోట్ల ఎమోషన్స్ తోనూ నవీన్ పొలిశెట్టి మెప్పించాడు. ముఖ్యంగా తన పాత్ర పరిస్థితులకు తగ్గట్టు వేరియేషన్స్ చూపిస్తూ.. నవీన్ పొలిశెట్టి నటించిన విధానం ఆకట్టుకుంది. హీరోయిన్ గా మీనాక్షి చౌదరి తన నటనతో అలరించింది. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ లో అలాగే సెకండ్ హాఫ్ లో మీనాక్షి చౌదరి తన నటనలో చూపించిన వేరియేషన్స్ బాగున్నాయి. మరో ప్రధాన పాత్రలో నటించిన రావు రమేశ్ తన పాత్రలో ఒదిగిపోయారు. సిల్లీ సిచ్యుయేషన్స్ లో కూడా తన టైమింగ్ తో ఆయన తన పాత్రను చాలా బాగా పండించారు. మరో కీలక పాత్రలో కనిపించిన తారక్ పొన్నప్ప నటన కూడా బాగుంది. ఇతర కీలక పాత్రల్లో



నటించిన చమ్మక్ చంద్ర, అనంత్, రంగస్థలం మహేష్ మరియు మిగిలిన నటీనటులు కూడా తమ పాత్రలకు న్యాయం చేశారు. దర్శకుడు మారి తనకు మొదటి సినిమా అయినప్పటికీ, కామెడీని హ్యాండిల్ చేసిన విధానం బాగుంది. ముఖ్యంగా నవీన్ పొలిశెట్టి నటన, ఆ క్యారెక్టర్‌ను ఫన్నీగా తీర్చిదిద్దిన విధానం కూడా బాగుంది.

మొత్తానికి సినిమాలో కొన్ని ఎమోషనల్ సీన్స్ తో పాటు కామెడీ సన్నివేశాలు బాగున్నాయి. నవీన్ పొలిశెట్టి పాత్రను, ఆ పాత్ర తాలూకు సీన్స్ ను బాగా డిజైన్ చేసుకున్నా, అంతే స్థాయిలో మిగిలిన పాత్రలను జనరంజకంగా క్రియేట్ చేయలేకపోయారు. అలాగే, సెకండ్ హాఫ్ లో కీలక సన్నివేశాల్లో ఆసక్తికరమైన




కథనాన్ని రాసుకోవడంలో దర్శకరచయితలు కొన్ని చోట్ల విఫలం అయ్యారు. మొత్తానికి సెకండాఫ్ స్క్రీన్ ప్లేతో పాటు ప్రధాన పాత్రలను ఇంకా బలంగా రాసుకుని ఉండి ఉంటే సినిమాకి మేలు జరిగేది. దర్శకుడు మారి తన టేకింగ్ తో మెప్పించినా.. తీసుకున్న స్టోరీ లైన్ కి పూర్తి స్థాయిలో ఆకట్టుకునే విధంగా దర్శకరచయితలు స్క్రీన్ ప్లేను రాసుకోలేకపోయారు. సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ బాగుంది. సంగీత దర్శకుడు మిక్కీ జె. మేయర్ అందించిన పాటలు పర్వాలేదు. సినిమాటోగ్రఫీ కూడా బాగుంది. సినిమాలోని చాలా సన్నివేశాలను చాలా బ్యూటిఫుల్ గా జె. యువరాజ్ చిత్రీకరించారు. ఇక ఎడిటింగ్ విషయానికి వస్తే.. అక్కడక్కడ ఉన్న కొన్ని సాగతీత సీన్స్ ను ఎడిటర్ తగ్గించాల్సింది. నిర్మాతలు నాగవంశీ, సాయిసౌజన్య ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. వారి నిర్మాణ విలువలు చాలా బాగున్నాయి. ''అనగనగా ఒక రాజు'' అంటూ ఫుల్ ఫన్ ఎంటర్ టైనర్ గా వచ్చిన ఈ చిత్రంలో.. నవీన్ పోలిశెట్టి కామెడీ టైమింగ్, మెయిన్ థీమ్ మరియు కామెడీ సన్నివేశాలు అలాగే కొన్ని ఎమోషనల్ మూమెంట్స్ బాగున్నాయి. ఐతే, కొన్ని రెగ్యులర్ సీన్స్ వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. ఓవరాల్ గా ఈ సినిమా యూత్ ఫుల్ కామెడీ ఎలిమెంట్స్ తో ఆకట్టుకుంది.

# నారి నారి నడుమ మురారీ రివ్యూ

యువ హీరో, హీరోయిన్లు శర్వానంద్, సంయుక్త మీనన్, సాక్షి వైద్య నటించిన రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ నారి నారి నడుమ మురారి. ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నిర్మాతలు అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఈ సినిమాకు యువ దర్శకుడు రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో సత్య, వీకే నరేష్, సుదర్శన్, సంపత్ రాజ్, శ్రీకాంత్ అయ్యంగార్, సునీల్, వెన్నెల కిషోర్, గెటప్ శ్రీను తదితరులు నటించారు. హాస్య ప్రధానంగా రూపొందిన ఈ సినిమాకు భాను భోగవరపు కథను అందించగా, నందు సావిరిగన డైలాగ్స్ రాశారు. జీ శేఖర, యువరాజ్ సినిమాటోగ్రఫిని, విశాల్ చంద్రశేఖర్ మ్యూజిక్ అందించారు. సంక్రాంతి కానుకగా ఈ సినిమా జవవరి 14వ తేదీన ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ అవుతున్నది. ఈ సినిమా సెన్సార్ ఫార్మాలిటీస్, రన్‌టైమ్ గురించిన వివరాల్లోకి వెళితే.. శర్వానంద్ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌తో మరోసారి సంక్రాంతి బరిలో దూకాడు. ఇద్దరు హీరోయిన్లతో రొమాంటిక్ లవ్ స్టోరీతో తన అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో ఇటీవల ఈ మూవీ సెన్సార్ ఫార్మాలిటీస్ ముగించుకొన్నది. ఈ సినిమాలోని కొన్ని అడల్ట్ ఫ్లేవర్ ఉన్న డైలాగ్స్, సన్నివేశాలపై సెన్సార్ నుంచి స్వల్ప అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. సెన్సార్ ప్రతినిధులు, అధికారుల సూచనలు, సలహాలను పాటించి వారిని కన్విన్స్ చేసే విధంగా మార్పులు చేశారు. దాంతో ఈ సినిమా సెన్సార్ ఎలాంటి వివాదాలు లేకుండా ముగిసింది అని చిత్ర యూనిట్ సభ్యులు తెలిపారు. ఇద్దరు భామల మధ్య నలిగిపోయే యువకుడి పాత్రలో శర్వానంద్ నటించిన ఈ సినిమాకు సెన్సార్ అధికారులు క్లీన్ సర్టిఫికెట్ జారీ చేశారు. ఈ సినిమాకు యూఏ (UA13+) సర్టిఫికెట్ ఇచ్చారు. ఈ సర్టిఫికెట్ ప్రకారం 13 ఏళ్లకు పైబడిన ప్రతీ ఒక్కరు ఎలాంటి అభ్యంతరాలు లేకుండా చూడొచ్చు.




13 ఏళ్లకు దిగువన ఉన్న వారు తల్లిదండ్రుల పర్యవేక్షణలో చూడాల్సి ఉంటుంది అని సెన్సార్ జారీ చేసిన నిబంధనల్లో పేర్కొన్నారు. ఇక సినిమా కథను మరీ సాగదీయకుండా లెంగ్త్ విషయంలో చిత్ర యూనిట్ సరైన జాగ్రత్తలు తీసుకొన్నట్టు స్పష్టమైంది. ఈ సినిమా నిడివి 2 గంటల 25 నిమిషాలకు అంటే 145 నిమిషాల రన్‌టైమ్‌కు పరిమితం చేశారు. దాంతో ఈ సినిమా క్రిస్పీగా, ల్యాగ్ లేకుండా ఉండే అవకాశం ఉందనే అభిప్రాయం కలుగుతున్నది. సంక్రాంతి కానుకగా జనవరి 15న ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ సినిమా. టీజర్, ట్రైలర్స్ వంటివి పెద్ద హోప్స్ అయితే ఇవ్వలేదు. కానీ దర్శకుడి పై ఉన్న నమ్మకం.. శర్వానంద్ సంక్రాంతి ట్రాక్ రికార్డు పై ఆధారపడి ప్రేక్షకుల ముందుకు వస్తుంది ఈ సినిమా. ఆల్రెడీ ఈ చిత్రాన్ని ఇండస్ట్రీలో ఉన్న కొంతమంది పెద్దలు వీక్షించారు. అనంతరం తమ అభిప్రాయాన్ని కూడా షేర్ చేసుకున్నారు.వారి టాక్ ప్రకారం.. సినిమా రన్ టైం 2 గంటల 25 నిమిషాలు ఉందట. సినిమా స్టార్టింగ్ నుండి నాన్ స్టాప్ గా పంచ్ డైలాగులతో సాగుతుందట. హీరో శర్వానంద్ 2 రకాల షేడ్స్ కలిగిన పాత్రలో మెప్పించారని చెబుతున్నారు. 'సామజవరగమన' సినిమాలో లానే ఈ సినిమాలో కూడా సీనియర్ నరేష్ కామెడీ హైలెట్ అయ్యిందట. సత్య, వెన్నెల కిషోర్, సుదర్శన్ వంటి వాళ్ళ కామెడీ ఆకట్టుకునే విధంగా ఉంది అంటున్నారు. అలాగే ఈ సినిమాలో కూడా ఓ సెన్సిటివ్ పాయింట్ ని టచ్ చేశారట. క్లైమాక్స్ ఈ సినిమాకి మరో హైలెట్ అంటున్నారు.శ్రీవిష్ణు కేమియో కూడా ఇంట్రెస్టింగ్ గా ఉంది అంటున్నారు. చూడాలి మరి ప్రీమియర్స్ తో ఈ సినిమాకి ఎలాంటి టాక్ వస్తుందో. శర్వానంద్ హిట్టు కొట్టి చాలా కాలం అయ్యింది. 2017 లో వచ్చిన 'మహానుభావుడు' తర్వాత శర్వానంద్ ఖాతాలో ఒక్క హిట్టు కూడా పడలేదు. 'ఒకే ఒక జీవితం' పర్వాలేదు అనిపించినా.. 'మనమే' యావరేజ్ గా నడిచినా ఆశించిన బ్లాక్ బస్టర్ అయితే దక్కలేదు. దీంతో కొంత గ్యాప్ తర్వాత కలిసొచ్చిన సంక్రాంతి సీజన్ కి 'నారీ నారీ నడుమ మురారి' అంటూ ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు శర్వానంద్. 'సామజవరగమన' వంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన దర్శకుడు రామ్ అబ్బరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు.



## హైస్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ పనుల్లో అపశ్రుతి

# రన్నింగ్ ట్రైన్‌పై కూలిన భారీ క్రేన్

## 22 మంది స్పాట్‌లోనే మృతి!

థాయ్‌లాండ్ దేశంలో బుధవారం ఉదయం గుండెలు పిండేసే ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పట్టాలపై వేగంగా వెళ్తున్న ఒక ప్యాసెంజర్ ట్రైన్ పై నిర్మాణ పనుల్లో వాడుతున్న ఒక భారీ క్రేన్ ఒక్కసారిగా కూలిపడింది. ఈ భయానక ఘటనలో ఇప్పటివరకు 22 మంది మరణించినట్లు అధికారులు ధృవీకరించారు. అంతేకాకుండా, 50 మందికి పైగా ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

అసలేం జరిగింది?

ఈ ప్రమాదం థాయ్‌లాండ్‌లోని 'నాఖోన్ రచ్చసిమా' ప్రాంతంలో జరిగింది. బ్యాంకాక్ నుండి ఉబోన్ రచ్చథాని వైపు వెళ్తున్న రైలు, సిఖియో జిల్లా గుండా ప్రయాణిస్తుండగా ఉదయం 9 గంటల సమయంలో ఈ దారుణం జరిగింది. అక్కడ పక్కనే ఒక హైస్పీడ్ రైల్వే ప్రాజెక్ట్ పనులు జరుగుతున్నాయి. ఆ పనుల కోసం ఏర్పాటు చేసిన ఒక భారీ కన్‌స్ట్రక్షన్ క్రేన్ అకస్మాత్తుగా కదిలే ట్రైన్ బోగీలపై కుప్పకూలింది.

మంటల్లో చిక్కుకున్న బోగీలు

క్రేన్ బరువుగా పడటంతో రైలులోని కొన్ని బోగీలు పట్టాలు తప్పాయి. ఆ వెంటనే ట్రైన్‌లో మంటలు చెలరేగడంతో ప్రయాణికులు భయంతో హాహాకారాలు చేశారు. ఈ ప్రమాద తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే, క్రేన్ కింద నలిగిపోయిన బోగీలను కట్టర్లతో కట్ చేసి క్షతగాత్రులను బయటకు తీయాల్సి వచ్చింది. స్పాట్‌లోనే చాలా మంది ప్రాణాలు కోల్పోయారు.

సహాయక చర్యలు మరియు ఇన్వెస్టిగేషన్

ప్రమాదం జరిగిన వెంటనే పోలీస్ బృందాలు, రెస్క్యూ టీమ్స్ ఘటనా స్థలానికి చేరుకున్నాయి. మంటలను ఆర్పేసి, గాయపడిన వారిని దగ్గర్లోని హాస్పిటల్ కు తరలించారు. క్షతగాత్రుల్లో కొందరి పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్లు చెబుతున్నారు. ఈ ప్రమాదంపై థాయ్‌లాండ్ రవాణా శాఖ మంత్రి సీరియస్ అయ్యారు. దీనిపై వెంటనే పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ జరపాలని ఆదేశించారు. చైనా సహకారంతో జరుగుతున్న ఈ ప్రాజెక్ట్ పనుల్లో భద్రతా లోపాల వల్లే ఈ ప్రమాదం జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు. రెస్క్యూ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోంది.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలేమో.. మెతుకు ఆనంద్ సెటైర్లు

జర్నలిస్టుల అరెస్టుపై వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకుడు మెతుకు ఆనంద్ మండిపడ్డారు. జర్నలిస్టులను అరెస్టు చేసి భయబ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మెతుకు ఆనంద్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర మంత్రి, మహిళా ఐఏఎస్ అధికారిపై ఓ వార్త చానల్‌లో వచ్చిన కథనం నేపథ్యంలో చానళ్లు, డిజిటల్ మీడియా హ్యాండిళ్లపై దర్యాప్తు కోసం రేవంత్ ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేయడంపై విమర్శలు గుప్పించారు. ఈ వ్యవహారంలో సీరియల్స్‌లో మాదిరి 8 మంది పోలీసులతో సిట్ ఏర్పాటు చేశారని ధ్వజమెత్తారు. ఎప్పుడో రేవంత్ రెడ్డిపై పోస్టు పెట్టిన కావలి వెంకటేశ్‌పైనా సిట్ వేశారని మెతుకు ఆనంద్ తెలిపారు. కొడంగల్ మద్దూరుకు చెందిన వ్యక్తిని కూడా సిట్‌లో ఇరికించారని పేర్కొన్నారు. అసలు సిట్ అనే దానికి ఏమైనా విలువ ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ భాషలో సిట్ అంటే కూర్చోవాలి.. స్టాండ్ అంటే నిలబడాలేమో అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నేత సంపత్ కుమార్ అనుచరులు మా వాళ్లను బెదిరించారని తెలిపారు. దీనిపై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ అవాస్తవాలు ప్రచారం చేస్తే సిట్ వేశారా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి కూడా అర్ధరాత్రి బుల్లెట్ మీద పోతున్నాడని మరో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి చెప్పారని గుర్తుచేశారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై సిట్ వేయరా అని ప్రశ్నించారు. ఆ రోజు ప్రెస్‌మీట్‌లో కోమటిరెడ్డికి ఏడుపొక్కటే తక్కువైందని అన్నారు. ఇంత విషమిచ్చి చంపండని కోమటిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారని గుర్తుచేశారు. మరి ఈ మొత్తం వ్యవహారం వెనుక ఉన్న వారిపై సిట్ వేయరా అని నిలదీశారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇంటి ముందు కాంట్రాక్టర్లు ధర్నా చేశారని మెతుకు ఆనంద్ గుర్తుచేశారు. బిల్లులు చెల్లించేందుకు కమీషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారని తెలిపారు. కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా కమీషన్లపై ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. దానిపై కదా సిట్ వేయాల్సింది అని అన్నారు. తుపాకీ పెట్టి బెదిరించి రూ.300 కోట్లు అడిగారని మంత్రి కొండా సురేఖ కూతురు చెప్పారు.. దానిపై కదా సిట్ వేయాల్సిందని అన్నారు. ములుగు జిల్లాలో మంత్రి ఇసుక దందా చేస్తున్నట్లు పత్రికల్లో వచ్చిందని తెలిపారు. దానిపై రేవంత్ రెడ్డి ఎందుకు సిట్ వేయలేదని ప్రశ్నించారు. వికారాబాద్‌లో ఎవరిని కదిలించినా కమీషన్లే అని విమర్శించారు. పోలీసుల దగ్గర మామూళ్లు, ట్రాన్స్‌ఫర్లకు కమీషన్లు అడుగుతున్నారని తెలిపారు. మోమిన్‌పేటలో రెండేళ్లలో ముగ్గురు సీఐలు మారారని తెలిపారు.





మరికొరి ప్రాణాలు బలితీసుకున్న

## చైనా మాంజా.. పట్టించుకోని ప్రభుత్వం

పండుగపూట విషాదం నెలకొంది. నిషేధిత చైనా మాంజా మంది ప్రాణాలను తీస్తున్న అటు ప్రభుత్వం ఇటు అధికారులు పట్టించుకోవడం లేదు. తాజాగా చైనా మాంజాతో గొంతు తెగి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన సంగారెడ్డి జిల్లా జిల్లా ఫసల్వాది గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన అవిదేశ్ (35) అనే వ్యక్తి బైక్ బైక్‌పై వెళ్తుండగా చైనా మాంజా గొంతును కోయడంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చైనా మాంజాను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, చైనా మాంజా ప్రాణాల మీదకు తీసుకొస్తుందని.. దీనిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## సంక్రాంతి వేళ ఆర్టీసీ బస్సుకు ప్రమాదం.. 20 మంది ప్రయాణికులకు గాయాలు

సంక్రాంతి వేళ ఏపీకి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్ నుంచి పెబ్బేరు మీదుగా కర్నూలు వెళ్తున్న కొల్లాపూర్ డిపో బస్సు మంగళవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ముందు వెళ్తున్న డీసీఎం వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న 20 మంది ప్రయాణికులు గాయపడ్డారు. అందులో డ్రైవర్‌తో పాటు మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. నాలుగు అంబులెన్స్‌ల్లో క్షతగాత్రులను మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. బస్సు యాక్సిడెంట్ కారణంగా కర్నూలు వైపు దాదాపు 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో పోలీసులు ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

## చంద్రబాబు ఇంటి ముందు ఆత్మహత్యకు యత్నించిన వృద్ధుడు


సంక్రాంతి పండుగ వేళ దారుణం జరిగింది. ఏపీ సీఎం చంద్రబాబు నివాసం ముందు ఓ వృద్ధుడు ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి పండుగ జరుపుకునేందుకు ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు కుటుంబంతో సహా తన స్వగ్రామమైన నారావారిపల్లెకు వచ్చిన సంగతి తెలిసిందే. చంద్రబాబు రాకతో తన సమస్యలను చెప్పుకునేందుకు చిత్తూరు జిల్లా రాజయ్యగారిపల్లెకు చెందిన గోవిందరెడ్డి (65) అనే వృద్ధుడు నారావారిపల్లెకు వచ్చాడు. కానీ చంద్రబాబు నివాసం వద్దకు వచ్చిన వృద్ధుడి ముందు అక్కడి బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. చంద్రబాబును వృద్ధుడు కలిసేందుకు నిరాకరించడంతో పాటు అత్యుత్సాహం ప్రదర్శించారు. దీంతో మనస్తాపానికి గురైన గోవిందరెడ్డి ఆత్మహత్యకు యత్నించాడు. ఇది గమనించిన సిబ్బంది వెంటనే అతన్ని నారావారిపల్లెలోని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.





## హాట్ లుక్‌లో కళ్యాణి

కళ్యాణి ప్రియదర్శన్ సౌత్ ఇండస్ట్రీలో టాప్ హీరోయిన్. 2017 నుండి సినిమాల్లో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. 2019లో తమిళ సినిమాలో హీరోయిన్‌గా అరంగేట్రం చేసింది. నటుడు శివకార్తికేయన్ సరసన నటించి మెప్పించింది. 2020 లో మలయాళ సినిమాలో నటిగా అడుగుపెట్టిన నటి కళ్యాణి ప్రియదర్శన్ అనేక చిత్రాల్లో నటించింది. ఇప్పుడు ఆమె నటించిన లోకా చాప్టర్ 1 చిత్రం దూసుకుపోతుంది. ఇప్పటివరకు దాదాపు 200 కోట్లకు పైగా వసూల్లు రాబట్టింది.కళ్యాణి ప్రియదర్శన్ కొన్ని సంవత్సరాల క్రితం ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, శివకార్తికేయన్ తనతో నటించక ముందే తాను ఆయనకు పెద్ద అభిమానినని అన్నారు. ఈ విషయం చెప్పినప్పుడు అతను నమ్మలేకపోయాడని తెలిపింది.అతను సెట్‌లో ఉన్నప్పుడు మేము నవ్వుకునేవాళ్ళం. అతడి కామెడీ టైమింగ్ అంటే నాకు ఎంతో ఇష్టం అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం కళ్యాణి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి.




భర్త చేసిన అప్పులు తీర్చేందుకు

## చైన్ స్నాచింగ్ చేసిన భార్య

### అరగంటలోనే పోలీసులకు చిక్కిన వైనం

కట్టుకున్నోడి కోసం ఓ మహిళ దొంగగా మారింది. భర్త చేసిన అప్పులు తీర్చేందుకు చైన్ స్నాచింగ్‌కు పాల్పడింది. కానీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన ఆ మహిళకు.. దొంగతనాలు చేతగాకపోవడంతో అరగంటలోనే దొరికిపోయింది. హైదరాబాద్‌లో జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మేడ్చల్ జిల్లాకు చెందిన రాజేశ్ అనే వ్యక్తి వరంగల్‌కు చెందిన అనితారెడ్డిని రెండేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. గతంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసిన అనితా రెడ్డి.. ప్రస్తుతం ఇంట్లోనే ఖాళీగా ఉంటుంది. అయితే తనను చూసుకోవడానికి భర్త రూ.5 లక్షల వరకు అప్పు చేసి.. తరచూ బాధపడుతుండటంతో అనితా రెడ్డి తట్టుకోలేకపోయింది. తన కోసం చేసిన అప్పును తానే ఎలాగైనా తీర్చాలని నిర్ణయించుకుంది. ఈ క్రమంలోనే సులువుగా, తొందరగా మనీ సంపాదించాలని.. దొంగతనాలు చేసేందుకు సిద్ధపడింది. ఈ క్రమంలో మియాపూర్ ప్రాంతానికి చెందిన నల్ల కమల అనే మహిళ మెడలో నుంచి చైన్ కాజేసేందుకు యత్నించింది. లిఫ్ట్‌లో వెళ్తున్న కమల చైన్ స్నాచింగ్ చేసేందుకు యత్నించగా.. బాధితురాలు గట్టిగా కేకలు వేసింది. దీంతో భయపడిపోయిన అనితా రెడ్డి చేతికి అందిన అర తులం నల్లపూసల గొలుసుతో అక్కడి నుంచి పారిపోయింది. అయితే బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సనత్ నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.





కూటమి పాలనలో పేదల చేతుల్లో డబ్బులు లేక

## సంక్రాంతి వెలవెల

### మాజీ మంత్రి రోజా

వైసీపీ నాయకురాలు, మాజీ మంత్రి రోజా సెల్వమణి ఏపీ ప్రజలకు భోగి , సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ' పాతదాన్ని దహనం చేసి కొత్తదాన్ని ఆహ్వానించే భోగి పండుగ, మన జీవితాల్లోని చెడును, బాధలను కూడా దహనం చేసి కొత్త వెలుగులు, కొత్త ఆశలు, కొత్త ప్రారంభాలు తీసుకురావాలని ఆకాంక్షించారు. నగరి నియోజకవర్గంలోని తన నివాసంలో బుధవారం భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ జగన్ హయంలో పేదలకు ఇచ్చిన సంక్షేమ పథకాలను కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అన్నింటిని నిలిపివేశారని ఆరోపించారు. పేదల చేతుల్లో డబ్బులు లేక ఏ పండుగను ఆనందంగా జరుపుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త సంవత్సరంలో మొదటి పండుగ సంక్రాంతికి రైతన్నలకు పంట చేతికొచ్చి చేతినిండా డబ్బులు ఉండే పండుగ అని అన్నారు. అందుకు భిన్నంగా రైతన్నలకు రబీకి ఆర్థిక సహాయం అందక పోవడం ప్రభుత్వం ఇస్తామన్న రూ. 40 వేలలో కేవలం రూ.10 వేలు మాత్రమే అందించడం , వర్షాలతో నష్టపోయిన రైతన్నలకు పరిహారం అందకపోవడంతో పండుగను సంతోషంగా జరుపుకోవడం లేదని ఆరోపించారు. వైఎస్సార్, వైఎస్ జగన్ హయాంలో రైతులు ఎంతో సంతోషంగాఉండేవారని పేర్కొన్నారు. వైద్యరంగాన్ని ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ జీవోలను రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ శ్రేణులు భోగి మంటల్లో దగ్ధం చేశారని వెల్లడించారు. నగరి నియోజకవర్గలో అత్యధికంగా చేనేత కార్మికులు ఉన్నారని, వీరికి ఉచితంగా కరెంట్ ఇవ్వాలని, పవర్‌లూమ్‌లకు కరెంట్ చార్జీలను తగ్గించాలని రోజా డిమాండ్ చేశారు.



నాలుగు కంపార్టుమెంట్లలో భక్తులు..

## నాలుగు గంటల్లో దర్శనం

తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతి సెలవులున్నప్పటికీ పండుగ దృష్ట్యా ఆలయానికి భక్తుల రద్దీ తగ్గింది. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నాలుగు కంపార్టుమెంట్లలో వేచి ఉన్నారు. నిన్న 73, 014 మంది భక్తులు దర్శించుకోగా 19,639 మంది తలనీలాలు సమర్పించు కున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల వల్ల రూ. 4.27 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.